కథ

# మలుపు

– ఆర్. మురళీకృష్ణ

భూమి అదురుతున్నట్లు అనిపించి చటుక్కున లేచాను. పెద్దగా చప్పుడు. మనుష్యుల అరుపులు. గోల. నిద్రమత్తు కొద్దిగా తగ్గేసరికి స్ఫురించింది. పక్కింట్లో బోర్ వేస్తున్నారు. అందుకే ఆ ప్రకంపనలు, అరుపులు. మరి చీకటో ? కరెంటు పోయినట్లుంది. పోయినట్లేమిటి. నిజంగానే పోయింది. తడుముకుంటూ వెళ్ళి కిటికీ పరదాలు పక్కకి జరిపా. ఆకాశం బాగా ముసురు పట్టింది. పెద్ద వర్షమే వచ్చేటట్లుంది. నిజంగానే వస్తే ? చిరాకేసింది. ఛీ. ఛీ. వెధవ బోర్‌వెల్ మోతకి తోడు ఈ వర్షపు వాతావరణం. రెండు వారాల గుబురు గడ్డం నా అసహనానికి అజ్యం పోసింది. ఏమిటో ఈ వెధవ జీవితం. అర్థం పర్థం లేకుండాను. వయస్సు పెరుగుతున్న కొద్దీ ఈ ఒంటరితనం భరించడం కష్టమవుతోంది.

చుట్టూ చూశా. మంచం మీద చిందవరందరగా పుస్తకాలు, బట్టలు, కాఫీ కప్పులు. నా జీవితంలా, అస్తవ్యస్తంగా తలుపులు తెరిచి వరండాలోకి వచ్చా. బామ్మగారింకా వచ్చినట్లు లేదు. టయివెంతో ? మధ్యాహ్నం మూడు దాటుండవచ్చు. ఆకలేసింది. బామ్మగారొచ్చేవరకూ మన ఆకలి శాంతించే మార్గం లేదు. కొట్టుకు వెళ్ళి ఏదన్నా తెచ్చుకొని తిందామంటె బద్దకం వేసింది. ఎంతలా మారిపోయాను. గడచిన పదేళ్ళలో ఎంత మార్పు. ఎలా ఉండేవాణ్ణి, ఎలా తయారయ్యాను. చివరికి ఓ ముసలావిడ దయాదాక్షిణ్యాలపై, రాకపోకలపై ఆధారపడ్డాను.

గతం గుర్తుకు వచ్చింది. పూల తేరు లాంటి సంసారం, ప్రేమాభిమానాలు రూపుకట్టిన అర్ధాంగి. ముద్దు మురిపాలు మూర్తీభవించిన కూతురు. సంపాదన ఎక్కువ లేకున్నా, ప్రభుత్వోద్యోగం. ఉన్నదాంతో తృప్తిగా ఉండేవాళ్ళం. నాకన్నా అదృష్టవంతుడు లేడనుకునే వాణ్ణి. అంతా సజావుగా సాగితే ఈ ప్రపంచం స్వర్గం అయిపోదూ.

నా ఈ సుందర ప్రపంచాన్ని భస్మం చేసిన శాపం లారీ రూపంలో వచ్చింది. స్కూలు నుంచి యింటికి తిరిగివస్తున్న నా భార్య, కూతురిని లారీ గుద్దేసింది. అక్కడికక్కడే వాళ్ళ జీవితాలు ఆర్పివేయబడ్డాయి. నేనిలా జీవచ్ఛవంలా మిగిలిపోయాను. నా స్వప్నసౌధాలు నేలకూలాయి. జీవితేచ్ఛ నశించింది. ఛిద్రమైపోయింది నా జీవిత నౌక. చనిపోదామనుకున్నాను. కాని ధైర్యం చాల్లేదు. చుట్టుపక్కల వాళ్ళంతా నా గుండె దిటువును మెచ్చుకున్నారు. వాళ్ళకేం తెలుసు ? నేను పిరికివాణ్ణి. జీవితంతో రాజీపడ్డాను. బంధువర్గం రెండో పెళ్లి చేసుకోమని పోరింది. కానీ పోయిన నా భార్య, కూతురి స్థానాల్లో వేరే వాళ్ళని నేను ఊహించుకోలేక పోయాను. ఇరవై ఏళ్ళ సర్వీసు అవగానే వాలెంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాను. సంపాదించి ఎవరికి పెట్టాలి గనక. వచ్చే కొద్దిపాటి పెన్షను నా అవసరాలకి పోను యింకా మిగులుతోంది. పుస్తకాలే నా ప్రపంచమయ్యాయి. వేరే వ్యాపకం పెట్టుకోలేదు. ఉన్న బంధువర్గమల్లా శ్రీరామ్

**తారణనామ ఉగాది సందర్భంగా రంజని నిర్వహించిన**
**రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ**

మా ఆవిడకి తమ్ముడు వరసవుతాడు. చాలా మంచివాడు. నా యోగక్షేమాలు తెలుసుకుంటూ, చేతనైన సహాయం చేస్తూంటాడు. ఇద్దరాడపిల్లల తండ్రి. వంటా వార్పు చేతకాక అవస్థ పడుతూంటె పాపం అతడే కుదిర్చాడు బామ్మగారిని. ఆవిడదో అవస్థ. పేదరికం. కూతురు వితంతువు. ఈవిడే ఆ సంసారానికి ఆధారం. మా యింటికి దగ్గర్లో ఒక చిన్నగది అద్దెకు తీసుకుని ఉంటోంది. కూతురు, మనుమలు, మనుమరాండ్రతో సహా. ఇదిగో, ఆవిడ గురించే నా తపస్సంతాను.

లాభంలేదు. ఆవిడ వచ్చే సూచనలు కనిపించడంలేదు. ఏ పిల్లదానికో, పిల్లవాడికో ఏదో అయివుంటుంది. ఆలస్యం అయ్యింది.

తలుపులు తాళం వేసి బయల్దేరా. బామ్మగారి దగ్గర యింకో తాళంచెవి ఉంది. నేను లేకపోయినా ఆవిడ పనికి ఆటంకం కలగదు. వీధంతా బురద, బురదగా తయారైంది. నీళ్ళకోసం తపన. ఎండాకాలం వస్తే బస్తీ ఎడారిలా వుంటుంది. కూడలి వద్ద హోటల్లో కాఫీ త్రాగి, వక్క నములుతూ లైబ్రరీ వైపు కదిలా.

ఒక్కరో, ఇద్దరో తప్ప ఖాళీగానే ఉంది. పేపర్లు తిరిగేసా. ఎన్నికలు, హత్యలు, వాగ్దానాలు, నిందలు, వగైరా, వగైరా మామూలే. ఎవరో పాప ఫోటో, ఏదో రోగంట. ఆపరేషనుకు చాలా ఖర్చు అవుతుంది. సహాయం చేయమని. అడ్రసు వ్రాసుకున్నాను. అయినంత సహాయం చేద్దామని.

అసంబద్ధంగా ఓ విషయం గుర్తొచ్చింది. పెళ్ళి చేసుకోకపోతే మానెయ్యి. కనీసం ఎవరినైనా పెంచుకోవచ్చుగా అన్నారు కొందరు. ఆర్థికంగా శక్తి ఉన్నా, మానసికంగా యింకొకరిని పెంచగలిగే స్థితిలో లేక కాదన్నాను. ఈగల్లా ముసురుతూన్న ఆలోచనలను తల విదిలింపులతో తోలి, వీధిలో పడ్డా.

ఎక్కడ చూసినా జనాలు. రణగొణ ధ్వని. ప్రతి ఒక్కడూ ఏదో పని ఉన్నట్లు, హడావుడిగా ఎక్కడికో ప్రయాణం. ఓ రకమైన బాధ. అందరికి ఎంతో కొంత బంధాలు, అనుబంధాలు నాకు తప్ప. ఒంటరితనం ఒక రంపపు కోత. ఏ పని లేకుండా, తిని తిరగడం, ఓ లక్ష్యం లేకపోవడం యింకో రకమైన కోత.

నేను తరుచుగా వెళ్ళే పాత పుస్తకాల షాపు ముసలాయన నన్ను చూసి పలకరింపుగా నవ్వాడు.

"ఓ పెద్ద యిన్‌స్టాల్‌మెంట్ వచ్చిందండి. రేపు రండి, చూద్దురు గాని" అన్నాడు తలూపి ముందుకు నడిచాను. ఎందుకో పాత పుస్తకాలు కొనడంలో ఉన్న సంతృప్తి నాకు కొత్త పుస్తకాలు కొనడంలో కనిపించదు. ధర తక్కువనే కాదు. పాతబడిపోయి, నలిగిపోయి జీవితంలో కష్ట నష్టాలను, ఒడిదుడుకులను చూసిన వాళ్ళలా ఉంటాయి. అదోరకమైన ఆకర్షణ. మానసికమైనది.

ఇంటిదారి పట్టాను. బామ్మగారు వచ్చుంటారు యీపాటికి. ఇంటినంతా చిమ్మి శుభ్రం చేసుంటారు. బయటికంటె యింట్లోనే నాకు బాగుంటుంది. బయటి ప్రపంచాన్ని, ఆవెలుగు, ఆ హోరు, హుషారు భరించలేను. గతాన్ని, ఆ గతపు ఆలోచనలు, వీటి సహచర్యం చాలు నాకు. గతము తలచి వగచె కన్నా సౌఖ్యమే లేదు" ఎంత అనుభవంతో చెప్పాడు ఆ గేయ రచయిత. సెల్ఫ్ పిటి. యింట్రోవర్ట్ బిహేవియర్ మంచిది కాదంటారు. అయినా జీవితం యింకా ముందున్న వాళ్ళకు మంచిది కాదు గాని నాలాంటి వాళ్ళకు కాదుకదా.

బోరింగ్ పని యింకా కొనసాగుతూనె ఉంది. రాత్రిదాకా తప్పదేమో. ఇంటి ముందర ఆగి ఓసారి నా ఒకనాటి కలల సౌధాన్ని పరికించి చూశా. ఎలా ఉండేది, ఎలా ఉంది. సురేఖ. అదే నా భార్య, కనీసం రెండు సంవత్సరాలకు ఓసారి రంగు వేయించమని పోరేది. తల్లీ


కూతుర్లిద్దరు పూలచెట్లు పెంచడంలో పోటీ పడేవారు. ఇప్పుడు పిచ్చిగా పెరిగిన చేట్లతో, గడ్డితో చిట్టడివిలా ఉంది.

ఇంట్లో బామ్మగారు కనిపించలేదు. పక్కింటావిడతో కబుర్లలో పడ్డారేమో. ఫ్లాస్కులోని కాఫీతాగి, కుర్చీలో కూలబడ్డా.

సుఖం వాళ్ళ జీవితాలలో గగన కుసుమమే.

"నేను ఓ రెండు రోజులు బయటికి వెళ్తున్నాను. మీరేం కంగారు పడకండేం" అన్నాను.

"అలాగే నాయనా", వివరాలు ఆవిడ అడగలేదు. నేను చెప్పలేదు.



ఎదురుగా ఉన్న టేబుల్ పైన ఉత్తరం కళ్ళబడింది. నాకు వ్రాసే వాళ్ళెవరబ్బా ? తీసిచూశా. శ్రీరామ్. అదే నాకు బావమరిది వరుస వాడు వ్రాశాడు. కూతురి పెళ్ళి నిశ్చయమయిందట, తప్పకుండా వచ్చిపొమ్మని. వెళ్ళాలా, వద్దా ? పోకపోతే బాగుండదు. బాధపడతాడు. పాపం నాగురించి ఎంత కష్టపడ్డాడు. ఓ రాత్రి రైలు ప్రయాణం. రెండ్రోజుల్లో వచ్చేయచ్చు. చూద్దాం.

"వచ్చావా నాయనా" అంటూ బామ్మగారొచ్చారు. డెబ్బయి అయిదు ఉంటుంది వయస్సు. అయినా యింకా గట్టి ముట్టిగా ఉన్నారు. పాత తరం వాళ్ళు, వాళ్ళ ధారుఢ్యం, తిండి యిప్పుడెక్కడ.

"ఓ రెండు వందలు కావాలి నాయనా, జీతంలో తగ్గించుకో, పిల్లదానికి ఒళ్ళటే ... " చెప్పుకు పోతోంది. మౌనంగా డబ్బిచ్చా. కొందరి జీవితాలు కష్టాల మయమే.

పెళ్ళిరోజు దగ్గిర పడింది. నేను ఓరోజు ముందుగానే ఊరు చేరుకున్నాను. చిన్న ఊరే. శ్రీరామ్ యిల్లంతా హడావుడిగా ఉంది. నన్ను ప్రత్యేకంగా చూసుకున్నారు. ఉన్నదాంట్లో బాగా అయిందనిపించారు పెళ్ళి. ఇక బయలుదేరుతానన్నా. స్టేషన్ దాకా ఆటోలో వస్తానన్నాడు శ్రీరామ్, వద్దన్నా. దారిలో చిన్న పనంటూ ఓ యింటి ముందర ఆపాడు. ట్రయిన్‌కు యింకా టయిముంది కదాని నేను అభ్యంతరం చెప్పలేదు.

చిన్న యిల్లు. కాని శుభ్రంగా ఉంది. శ్రీరామ్‌ని చూడగానె "రండి" అంటూ ఆహ్వానించారు ఓ ముసలిజంట. ఆది దంపతుల్లా ఉన్నారు. మాటల సందర్భంలో తెలిసింది. వాళ్ళ కొడుకు, కోడలు ఏదో ఆక్సిడెంట్‌లో అకాల మృత్యువు వాత పడ్డారని. నాకు ఎక్కడో కలుక్కుమంది. నాలాగా ఎందరో.

తన కొడుక్కి రావలసిన బాకీల గురించి ఆ ముసలాయిన శ్రీరామ్‌తో మాట్లాడుతున్నాడు. ఆయన పరిస్థితి చూస్తే చాలా యిబ్బందుల్లో ఉన్నట్లున్నాడు. ఇంతలో ముసలావిడ కాఫీ తన మనుమరాలు చేత పంపించింది. తరువాత తెలిసింది, ఒక్కతే మనుమరాలని.

చక్కని వర్చస్సు, పెద్ద కళ్ళు, మంచి మర్యాద, బహుశ శర్వాణి – నా కూతురు జీవించి ఉంటె యిలాగే ఉండేదేమో.

"పేరేంటమ్మ" అడిగాను.

"చందన" స్పష్టంగా ఉంది గొంతు. ఐదోక్లాసు చదువుతోందట. పది పన్నెండేళ్ళు ఉంటాయేమో. నాకు ఎక్కడో, ఏదో ఓ మూల చిన్న కదలిక. ఒళ్ళో కూర్చోపెట్టుకుని మెల్లిగా మాటలు కలిపా. శ్రీరామ్ మాటల మధ్యలో నావైపు ఆశ్చర్యంగా చూడటం గమనించా.

అరగంట తరువాత యిద్దరం బయలుదేరాం. నేను అయిష్టంగానే కదిలా. ఎక్కడి అనుబంధమో.

స్టేషన్‌లో చెప్పాడు శ్రీరామ్ ఆ ముసలి దంపతుల చింతల్లా ఆ పాప గురించేనట. తమ తరువాత ఆ పసిదాని భావి గురించే వాళ్ళ ఆందోళనట.

హఠాత్తుగా, అనాలోచితంగా, నా నోట ఓ ప్రశ్న వెలువడింది.

"పాపను ఎవరికైనా దత్తత యిస్తారటా" ?

విస్మయంగా చూశాడు నావంక. "ఏం" ?

"ఏంలేదు. తెలుసుకుందామని"

"ఏమో, బాగా తెలిసిన వాళ్ళైతే తప్ప ఒప్పుకోకపోవచ్చు. ఒక్కోసారి మనకు తెలియకుండానే, అనాలోచితంగా పెద్ద నిర్ణయాలు తీసేసుకుంటాం. అది సరియైనవా, కావా అన్నది వేరే సంగతి.

"నాకు దత్తత యిస్తారేమో కనుక్కో" ఒక్కసారిగా అనేశాను.

నిర్ఘాంతపోయాడు. కొంచెం సేపు మాట్లాడలేదు.

"బాగా ఆలోచించారా" ? మెల్లిగా అడిగాడు

"ఆ. కాని ఓ విధంగా నేను ఆ పాపను దత్తత తీసుకోవట్లేదు. ఆపాపే నన్ను తండ్రిగా దత్తత తీసుకుంటోంది". ఎందుకో చివరి వాక్యం నాకు నచ్చింది. నిజం కూడా అదే. ఆ పాప రాకతో నా జీవితంలో మరల వెలుగు వస్తుందేమో. సాలోచనగా తలూపాడు.

"ఒప్పిస్తావా" ?

"ప్రయత్నిస్తా"

"చివరిసారిగా ఈ ఉపకారం చెయ్యి. నన్ను నేను తిరిగి బాగు చేసుకునే అవకాశం కల్పించు" కొద్దిగా ఉద్వేగభరితంగా అన్నాను.

చిన్నగా నవ్వాడు. "అలాగే"

ఇంతలో ట్రెయిన్ రావడం, నేను ఎక్కడం జరిగిపోయాయి.

రైలు కదిలేదాకా యిద్దరం ఎక్కువగా మాట్లాడుకోలేదు. అతడింకా తేరుకున్నట్లు లేదు. నా మటుకు నేను ఓ రకమైన ఉత్సాహంతో మెదడుకి పదును పెట్టసాగాను.

చిన్నపిల్ల. తొందరగా కలిసిపోతుంది. డబ్బు సమస్య కాదు. ఉండటానికి ఎలాగూ నాకు స్వంతిల్లుంది. నా పెన్షన్ మా అవసరాలకి సరిపోతుంది. ఆడపిల్లను పెంచటానికి ఎలాగా బామ్మగారుండనే ఉన్నారు. ఆవిడ కూతురి సహాయం తీసుకుంటే సరి. అంతగా అవసరం అయితే నేనూ ఓ చిన్న ఉద్యోగం చూసుకోవచ్చు.

ట్రెయిన్ కదిలింది. శ్రీరామ్ చెయ్యిని కొద్దిగా నొక్కి చెప్పా.

"సాధిస్తావు కదూ" ?

చిరునవ్వుతో అన్నాడు "తప్పకుండా"

ఓ కొత్త జీవితానికి నాందిగా నా రైలు ప్రయాణం సాగింది. ❋